ప్రజాశక్తి

ఆదివారం 19 జనవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సహకార ఎన్నికల కసరత్తు

- ప్రాథమిక సభ్యత్వాల నమోదుకు గ్రీన్ సిగ్నల్
- రూ.300 షేరుధనంతో కొత్త సభ్యుల చేరికకు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిసింది. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి వివరాలను ఉన్నతాధికారులు సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 167 సహకార రికార్డుల కంప్యూటరీకరణ ఇటీవల చేపట్టారు. అంతేగాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పిఎసిఎస్) ప్రస్తుతం ఉన్న సభ్యుల వివరాలను అప్‌డేట్ చేయాలని, ప్రధానంగా ప్రతి రైతు చేత ఈకేవైసి చేయించి స్థానిక చిరునామాతో నిర్ధారణ చేయాలని ప్రభుత్వం సూచించింది. రూ.300 షేర్ ధనంతో సభ్యులుగా చేరు వారు స్థానికంగా పాస్‌బుక్, ఆధార్ కార్డు కలిగి ఉన్న చిరుమానాతో వివరాలు ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరణ చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మంది సభ్యులు ఉన్నారు. కొత్త సభ్యుల చేరిక కూడా అవకాశం కల్పిస్తున్నారు. భూమి ఒకచోట ఉండి, నివాసం మరొక చోట ఉంటే భూమి ఉన్న ప్రాంతంలోని సొసైటీ అధికారి నుంచి తమ సొసైటీలో సభ్యత్వం లేదని ధ్రువీకరణ పొంది నివసిస్తున్న ప్రాంతంలోని సొసైటీలో సభ్యత్వం తీసుకోవచ్చునని అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. పొలం ఉన్న ప్రాంతంలో కంటే ఆధార్ కార్డులో చిరుమానా ఎక్కడ ఉంటే అక్కడి సొసైటీలోనే చేరేందుకు అనుమతిచ్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2013లో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 2018లో కాలపరిమితి ముగియగా టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి అధ్యక్షులతో పాటు పాలక వర్గాల పదవీకాలాన్ని కొద్ది కాలం పొడిగించారు. ఎన్నికలను నిర్వహించలేదు. ఆ తరువాత ప్రత్యేక అధికారులు, పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించారు. 2019 మేలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎన్నికలు నిర్వహించలేదు. పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించలేదు. వైసిపికి చెందిన ముగ్గురు సభ్యులతో నామినేటెడ్ పద్ధతిలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ▶ 2లో



వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద నిరసన తెలియజేస్తున్న రైతుసంఘం నాయకులు

మద్దతు ధరల చట్టం చేయాలి

- జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ దీక్షలకు మద్దతుగా రైతుసంఘం నిరసన
- కేంద్రం స్పందించాలని, చర్చలు జరిపి రైతునాయకుని ప్రాణాలు కాపాడాలని డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా పంటలకు మద్దతు ధరలను కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలనే చట్టం కోసం 54 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న రైతునాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా, ఆయన ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నిరసన చేపట్టింది. మండలంలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ▶ 2లో



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

బాలానందన్ శతజయంతి సభలో సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

వార్త మెయిన్ పేజీలో



నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న వాపమక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి పర్యటనపై వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి క్షమాణలు చెప్పాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ శనివారం గుంటూరులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. క్షమాణ చెప్పాలని, లేకుంటే రాష్ట్ర పర్యటన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ (ఎంఎల్), ప్రజాపోరు నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి అంబేద్కర్ పట్ల, భారత రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. అధికారం చేపట్టిన నాటి నుండి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయటానికి ప్రయత్నిస్తూనే ఉందని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించే స్థాయికి బిజెపి ఉన్మాదం చేరిందని మండిపడ్డారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రధాని ఖండించకపోవటం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు ఎల్.అరుణ, యం.ఎ.చిష్టీ, బి.సత్యనారాయణ, షేక్ ఖాశింవలి, షేక్ బాషా, షేక్ ఖాశిం షహీద్, రాధాకృష్ణమూర్తి, అంజిబాబు, సురేష్, హనుమంతరావు, అరుణ్ పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్తను శుభ్రం చేస్తున్న జేసీ భార్గవ్ తేజ తదితరులు

కలెక్టరేట్లలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు, పల్నాడు కలెక్టరేట్లలో గుంటూరు, పల్నాడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఎ.భార్గవ్‌తేజ, జూరజ్ ధనుంజయ్ గనోరే ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని చెత్త, ▶ 2లో



నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న జెసి సూరజ్ ధనుంజయ్ గనోరే తదితరులు



8లో

వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి మనోహర్

చెత్త వినియోగంపై దృష్టి పెట్టండి

స్థానిక సంస్థలకు పవన్ కల్యాణ్ ఆదేశం



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న రిపోర్టర్, యూనియన్ నాయకులు

రిపోర్టర్‌పై దాడికి యత్నం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తనపై భూకబ్జా దారులు దాడికి యత్నించారని, చంపుతామంటూ బెదిరించారని మహాటీవీ మాచర్ల నియోజకవర్గ రిపోర్టర్ గాజుల గణేష్ ఎపియుడబ్ల్యూజె నాయకులతో కలిసి మాచర్ల పట్టణ ఎస్ఐ సంధ్యారాణికి శనివారం ఫిర్యాదు చేశారు. మాచర్ల మండలం ఎయిర్పోర్ట్ సమీపంలో 2019-24 సంవత్సరాల మధ్యలో దొడ్డ చిన్న పెద్దిరాజు, మాధవరపు చంద్రశేఖర్ వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పట్టాలు పొందారని, ఈ భూ కుంభకోణంపై వాస్తవాలు వెలికి తీస్తున్నట్లు తెలిసిన కబ్జాదారులు మాచర్లలోని ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న తనను వెంబడించి రాడ్లతో దాడికి యత్నించారని చెప్పారు. చంద్రశేఖర్ ఫోన్‌లో తనను దుర్భాషలాడారని, చంపుతామంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎంవి రెడ్డి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో
165 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్ల మండలంలోని వడ్లమూడివారిపాలెంలో నరసరావుపేట ఎంవి రెడ్డి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయగా శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఎంవి రెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి, డాక్టర్ ఎల్.సృజన ముద్దంను ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 165 మందికి పరీక్షలు నిర్వహించగా 27 మందికి శుక్లం, ఏడుగురికి కంటి పొరలు ఉన్నట్టుగా నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా చుక్కల మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద చేస్తామని, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి రాయితీపై ఆపరేషన్‌లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట కమిటీ మాజీ చైర్మన్ జి.నరసింహారావు, టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు, వి.శివరామయ్య, రాంబాబు, బుజ్జి, శ్రీను, కోటిస్వామి పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు.. స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ



ప్రజాశక్తి - నకరికల్లు

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీని పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరిచే కార్యక్రమాలను తూతూ మంత్రంగా నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి కెవిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తనపల్లి రూరల్

మండలంలోని నందిగామ జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుండి 100 శాతం చెత్త సేకరణ జరగాలని, చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరు చేయాలని, ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేయాలని సూచించారు. చెత్త కుప్పలు లేని గ్రామంగా చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని చౌత్ర సెంటర్ వద్ద వ్యర్థాలను తొలగింపజేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎ.సాంబయ్య, సర్పంచ్ బి.రమాదేవి, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుండి పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పాడ్డారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధమని, వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లు అమ్మొద్దని చెప్పారు. అనంతరం 15వ వార్డులో పారిశుధ్య పనులు పరిశీలించారు.



ప్రజాశక్తి - బెల్లంకొండ

స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బంది వెంకటరామయ్య, యోగా టీచర్ భూక్య హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు



ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులో చేపట్టిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎంపిపి పి.కోటయ్య మాట్లాడి ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ చందమామ, సెక్రటరీ కె.వెంకయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడారు. రోడ్లపై చెత్త వేయొద్దని, బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జనలు చేయొద్దని కోరారు. ప్లాస్టింగ్ వస్తువుల వినియోగం సాధ్యమైనంత వరకు తగ్గించాలని చెప్పారు. వ్యక్తిగత వాహనాలకన్నా, ప్రజా రవాణా వాహనాలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజా, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల : తహశీల్దార్ కార్యాలయం ప్రాంణంలో శుభ్రం చేశారు. అధికారులు, సిబ్బందితో తహశీల్దార్ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి -రెంటచింతల : రెంటచింతలలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఎంపిడిఒ కె.సరోజినిదేవి మాట్లాడారు. ఏపీఓ జయచంద్ర, మిట్టగుడిపాడు సర్పంచ్ జి.ప్రమీల గురువారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, కె.నాగేశ్వరరావు, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎవిఎన్ కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తాడేపల్లి పట్టణం ప్రకాష్ నగర్‌లో అంగనవాడీల విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. కుమారి మాట్లాడుతూ ఇప్పటికీ అంగనవాడి సెంటర్లో కాండిమెంట్ బిల్లులు, సెంటర్ అద్దెలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలన్నారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడారు. సుజాత, సరళ, హేమలత, కిరణ్మయి, తంబీరాణి, నాగమల్లేశ్వరి, ఆఫ్రిన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎవిఎన్ కుమారి

సహకార ఎన్నికల కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని, నకిలీ రైతులు పేరుతో రుణాలు పొందారని కూడా జిల్లా వ్యాప్తంగా 13 కేసులు నమోదయ్యాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక అధికారులతోనే పర్సన్ ఇన్‌ఛార్జిల నియమాకం చేశారు. గతంలో మాదిరిగా ముగ్గురు సభ్యులతో కమిటీలు ఇప్పుడు లేవు. అన్ని సహకార సంఘాల స్థాయిలో ప్రత్యేక అధికారులు పర్సన్ ఇన్‌ఛార్జిలను ఏర్పాటు చేశారు. ఆరు నెలల కాలపరిమితితో వీరిని నియమించారు. రానున్న ఆరు నెలల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది.

అంతేగాక సాంకేతికంగా అన్ని సహకార సంఘాల రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్నారు. పిఎసిఎస్‌లను మినీ వ్యాపార కేంద్రాలుగా మార్చాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం సహకార సంఘాల్లో ఉన్న సభ్యులు, వారి వివరాలు, సంఘం పరిధిలోని రైతులు, వారికి అందిస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ కంప్యూటరీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ధేశించింది. ఇప్పటి వరకు మాన్యువల్‌గా జరుగుతున్న సేవలను ఇక మీదట కంప్యూటరీకరణ చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పరుగు మందులు, విత్తనాలు అందించడంతో పాటు ప్రతి సహకార సంఘంలో కామన్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ అప్ డేషన్, ఈకేవైసి, వివిధ రకాల ప్రభుత్వ ధృవపత్రాల జారీ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి నిర్వహిస్తున్న సేవలన్నీ కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మద్దతు ధరల చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

శనివారం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందన్నారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన హామీని అమలు చేయకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. రైతుసంఘాలతో కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్చించాలని, రైతుల న్యాయమైన డిమాండ్లను అమోదించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందేగాని రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉద్యమాల ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలన్నారు. పంజాబ్, హర్యానా రైతులు సాగిస్తున్న ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వై.కేశవరావు, ఎం.సూర్యనారాయణ, జె.శివశంకర్, ఎం.హరిబాబు, పి.వి ఆంజనేయులు, బలరామ్, శ్రీనివాస్, రాజశేఖర్, రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, హేమలత, వి.భారతి పాల్గొన్నారు.

కలెక్టరేట్లలో స్వచ్ఛాంధ్ర

(మొదటి పేజీ తరువాయి)

ఇతర వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటారు. జిల్లా అధికారులతో వారివారి కార్యాలయాలను శుభ్రపరచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు అందరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగులు వారి ఫైళ్లను వారికి కేటాయించిన విభాగంలో క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని సూచించారు. కార్యాలయాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించాలన్నారు. ప్రతినెలా మూడవ శనివారం విధిగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గుంటూరులో డిఆర్‌ఒ షేక్.ఖజావలి, ఆర్‌డిఒ శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ జ్యోతిబసు, డిఆర్‌డిఎ, డ్వారా, గృహ నిర్మాణ శాఖల పీడీలు విజయలక్ష్మీ , శంకర్, ప్రసాద్, మత్స్య శాఖ డిడి గాలిదేముడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాకేంద్రమైన నరసరావుపేటలో డిఆర్‌ఒ మురళి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ అధికారి భానుకీర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా జిల్లాలో టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు ఘనంగా ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు.

తాడేపల్లి మండలం వడ్డేశ్వరం, కుంచనపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం కోయావారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని సోదరుడు రవిశంకర్, ఎమ్మెల్యే బి రామాంజనేయులు ఆవిష్కరించారు. తుళ్లూరులో మండల తెలుగుయువత ఆధ్వర్యంలో గీతామందిరం, లైబ్రరీ సెంటర్‌లోని ఎన్‌టిఆర్ వర్ధంతి సభలు నిర్వహించారు. గుంటూరులో గుంటూరు జిల్లా టిడిపి లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం వెయ్యిమందికి అన్నదానాన్ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రారంభించారు. తాడికొండలో ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. రావిచెట్టు సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలో మంగళగిరి టీడీపీ కార్యాల యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్, ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దుగ్గిరాలలో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రైలు పేటలో జరి గిన కార్యక్రమంలో ఆయన తెలుగు జాతికి చేసిన సేవలను కొనియాడుతు నివాళులు అర్పించారు.



కోయావారిపాలెంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే



గుంటూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు



మంగళగిరిలో టిడిపి నాయకుల నివాళి



వడ్డేశ్వరంలో నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- రెంటచింతల

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్. నాగార్జున తెలిపారు. ఈనెల 14న సంక్రాంతి పండుగ రోజున గురజాల మండలం దైద గ్రామానికి చెందిన తోట అమర లింగయ్య (62) తుమ్మరకోటలో ఉన్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం ఎక్కి వెళ్తున్న సమయంలో తిమ్మాయికుంట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు గాయపడగ వారిలో అమరలింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు అమరలింగయ్యకు ముగ్గురు సంతానం ఉన్నారు.

మిర్చి నర్సరీల్లో పురుమందులు చోరీ

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో పలు నర్సరీలో శుక్రవారం రాత్రి దొంగతనాలు జరిగాయి. పల్నాడు నర్సరీ, జేఎంజే, కారుణ్య, శ్రీరామ్ నర్సరీలో క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమోటా, మిర్చి నార్లను సాగు చేస్తున్నారు. పురుగుల నివారణకు ఉపయోగించే పురుగు మందులను అపహరించకుపోయారు. ఈ పురుగు మందుల విలువ 30 వేల రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. అలాగే వారం రోజుల క్రితం మరో నర్సరీలో ఇలాగే చోరీ జరిగింది దొంగతనం జరిగిన నర్సరీలను ఎస్ఐ సిహెచ్. నాగార్జున శనివారం పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలపై మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

- వారు లేకుంటే పట్టించుకునే వారే ఉండరు
- కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి
- ఆత్మీయ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగ, ఉపాధ్యాయ, చిరు ఉద్యోగులు, కార్మిక, కర్షకుల పక్షాన వారి వాణిని చట్టసభల్లో వినిపిస్తూ ఆయా వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కెఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా మళ్లీ గెలిపించాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎ.భాగేశ్వరిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో 2.50 లక్షల మంది పట్టభద్ర ఓటర్లుండగా ప్రస్తుతం 3.46 లక్షల మంది నమోదయ్యారని చెప్పారు. నరసరావుపేట నియోజకవర్గంలో 9000 పట్టభద్రుల ఓట్లు 8 బూతుల పరిధిలో ఉన్నాయని తెలిపారు. ఈ ఎన్నిక రాజకీయ, కుల, ధన బలమైన వర్గానికి, చైతన్యం కలిగిన పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి జరుగుతున్న ఎన్నికలుగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. పిడిఎఫ్‌కు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాబలం, కార్యకర్తల బలమే ఉందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల్లో ఓటు వేసే విధానంలో జరిగిన లోపాల వలన 5 వేలకు పైగా పిడిఎఫ్ అభ్యర్థికి చెందిన ఓట్లు చెల్లుబాటు కాలేదని, ఈ సారి ఆ సమస్య రాకుండా చూసుకుందామని చెప్పారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో రాజకీయాలను కార్పొరేట్లు శాసిస్తున్నారని, వారిని నిలువరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఎమ్మెల్సీగా శాసన మండలిలో ప్రస్తావించిన ప్రజా సమస్యలు, పాల్గొన్న ప్రజా ఉద్యమాలను గుర్తు చేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ 58 వేల మంది పట్టభద్రులున్న పల్నాడు జిల్లాలో ఎక్కువ ఓట్లు పిడిఎఫ్ అభ్యర్థిగా దక్కేలా కృషి చేద్దామన్నారు. కౌలురైతులకు రుణాల కోసం, గుర్తింపు కార్డుల కోసం కెఎస్ లక్ష్మణరావు అనేక వేదికలపై మాట్లాడారని గుర్తు చేశారు. అనంతరం పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు కెపి.మెటిల్డాదేవి మాట్లాడారు. విద్యార్థి దశనుండే ఉద్యమ బాట పట్టిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించారని, నిరంతరం ప్రజల మధ్య ఉండే వ్యక్తి అని అన్నారు. రాజకీయ వేధింపులకు చిరుద్యోగులు గురైన అనేక సందర్భాల్లో జిల్లా కలెక్టర్లతో, అధికారులతో, చట్టసభలలో కూడా వారికి న్యాయం చేసేందుకు పోరాటం చేశారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల బాధ్యతల పట్ల, హక్కుల పట్ల పిడిఎఫ్ ఎమ్మెల్సీలు సాధించిన ఫలితాలను నేడు ఆయా వర్గాలు అనుభవిస్తున్నాయని చెప్పారు. సమర్థత, సమస్యల పట్ల పరిష్కారానికి స్పష్టమైన అవగాహన కలిగిన లక్ష్మణరావును గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యా వ్యవస్థలో రోజుకో మాట, రోజు జీవో అమలు చేస్తూ ప్రభుత్వాలు అర్థం లేని విధంగా ఉపాధ్యాయులను పరుగులు పెట్టిస్తున్నాయని చట్టసభలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు లేకపోతే ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల గురించి పట్టించుకునే వారే ఉండరని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గుంటూరు మల్లీశ్వరి, సాయి కుమారి, మాధవి, విజయలక్ష్మి, నిర్మల, కామినేని రామారావు, కోంద్రు ఆంజనేయులు, కొత్తపల్లి హనుమంతరెడ్డి,టి.పెద్దిరాజు, మస్తాన్‌వలి, బోస్, కొమ్మల నాగేశ్వరరావు, సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, ఉద్యోగ, ఉపాధ్యాయ, అంగన్వాడీ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పైపులైను పగలగొట్టారు.. పట్టించుకోవడం మానేశారు..

ప్రజాశక్తి - నకరికల్లు

చెంతనే చెరువు ఉన్నా నకరికల్లులోని బంగ్లా గడ్డ ప్రజలు తాగునీటికి తంటాలు పడుతున్నారు. 8 రోజుల నుండి ఈ బజారుకు నీరు సరఫరా కావడం లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం ప్రతి గ్రామానికి కొన్ని నిధులను కేటాయించింది. ఆ నిధులతో సినిమా హాల్ బజార్లో సైడ్ డ్రెయిన్లు నిర్మించేటప్పుడు బంగ్లా గడ్డ ఏరియాకు నీరు



సరఫరా అయ్యే పైప్‌లైన్ అడ్డుగా ఉందని పగలగొట్టి కాల్వలు నిర్మించారు. కాంట్రాక్టర్‌కు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులంటున్నారు. ఈ నేపథ్యంలో



తాగునీటి కోసం గ్రామంలోని వాటర్ ప్లాంట్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించకుంటే అద్దంకి -నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ఎంపిడిఒ జి.కాశయ్యను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, రెండ్రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు.

అవయవ దానం ద్వారా మరణం తర్వాతా జీవించిన కళ్లం మునెమ్మ

ప్రజాశక్తి-సత్తెనపల్లి, ముప్పాళ్ల

తన అవయవాలను దానమివ్వడం ద్వారా మరణం తర్వాత కూడా జీవించిన ఆదర్శమూర్తి కళ్లం మునెమ్మ అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన సిపిఎం నాయకులు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తెనపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు మునెమ్మ సంస్మరణ సభ శనివారం ముప్పాళ్ల మండలం బొల్లవరంలోని ఆమె నివాసం వద్ద జరిగింది. సభకు సిపిఎం ముప్పాళ్ల మండల కార్యదర్శి జి.బాలకృష్ణ అధ్యక్షత వహించగా విజయకుమార్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం మునెమ్మ, సత్యనారాయణరెడ్డి దంపతులు కృషి చేశారని, మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాడారని, గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం పాటుపడ్డారని చెప్పారు. పార్టీ అప్పగించిన పనిని సమర్థవంతంగా పూర్తి చేసేందుకు నిర్విరామంగా కృషి చేశారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం జూదంగా మారి రైతులు అప్పుల పాలవుతున్నారని, ప్రభుత్వ రంగం ధ్వంసం అవుతోందని, ప్రజానికం ఆర్థిక ఇబ్బందులతో అవస్థ పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో మునెమ్మ, సత్యనారాయణ దంపతులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన కోసం పనిచేయాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి, వై.రాధాకృష్ణ, సిపిఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి డి.విమల, అవయవ దాన సంఘం కో-ఆర్డినేటర్ చలపతిరావు మాట్లాడుతూ 1959లో ప్రేమ వివాహం చేసుకున్న మునెమ్మ, సత్యనారాయణరెడ్డి దంపతులు నాటి నుండి నేటి వరకు సిపిఎం కార్యకర్తలుగా, రైతు, మహిళా సంఘం కార్యకర్తలుగా ఆయా వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేశారని అన్నారు. మునెమ్మ తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలలకు అవయవదానంగా ఇచ్చి వైద్య విద్యార్థులకు పాఠాలను నేర్చుకునేందుకు ఉపయోగపడ్డారని, కళ్లను శంకర్ కంటి ఆసుపత్రికి దానంగా ఇచ్చారని తెలిపారు. మునెమ్మ భర్త సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మునెమ్మ జ్ఞాపకార్థంగా నరసరావుపేటలో నిర్మాణం అవుతున్న పల్నాడు విజ్ఞాన కేంద్రానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు జి.మల్లేశ్వరి, జి.ఉమశ్రీ, జి.రజని, ఎం.శారద మాట్లాడి మునెమ్మతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలుత మునెమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మునెమ్మ పెద్ద కుమార్తె, అల్లుడు ఈద ఈశ్వరమ్మ, వీరారెడ్డి, చిన్న కుమార్తె అల్లుడు ప్రభావతి, ఓబుల్‌రెడ్డి, సిపిఎం కాజ గ్రామ నాయకులు సింహాద్రి ప్రతాపరెడ్డి ప్రముఖ న్యాయవాది కళ్లం వీరభాస్కర్‌రెడ్డి, ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, నాయకులు పి.సూర్యప్రకాశరావు, డివైఎఫ్ఐ నాయకులు జె.రాజకుమార్, సిపిఎం నాయకులు హుస్సేన్, టి.మస్తాన్‌రావు, జి.జాలయ్య పాల్గొన్నారు.


సంస్మరణ సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

సంస్మరణ సభలో వక్తలు ఘనంగా నివాళి



వాహనం ఆపి.. ముఖం కడిగించి..

ప్రజాశక్తి - దాచేపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్థానిక అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిఐ భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం వాహనాలను ఆపి డ్రైవర్లకు మొహం కడిగించి పంపించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తెల్లవారు జామున ప్రయాణం చేసే వాహనదారులు చలికాలంలో మంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అందుకే ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు.



నిద్రమత్తు వస్తే బండి ఆపండి..

ప్రజాశక్తి చిలకలూరిపేట : 36వ జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెఎల్ రావు శనివారం అవగాహన కల్పించారు. అతివేగం వద్దని, నిద్ర మత్తు వచ్చినప్పుడు వాహనాలు ఆపి ముఖం కడుక్కున్న తర్వాత ప్రయాణాన్ని మళ్లీ ప్రారంభించాలని చెప్పారు. లైసెన్స్ తప్పనిసరన్నారు.



సబ్‌జైలులో న్యాయమూర్తుల పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లిలోని సబ్ జైలును సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహ్మద్ గౌస్ శనివారం సందర్శించారు. పరిసరాలతోపాటు ఆహారం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. ఖైదీల హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ప్రభుత్వం ద్వారా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరిరాజ, పట్టణ ఎస్ఐ పవన్ కుమార్, జైలు సూపరింటెండెంట్, పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

సిడిపిఒ కార్యాలయం వద్ద స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : నరసరావుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాలను శుభ్రం చేశారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించారు.



పరిసరాల శుభ్రతపై సిడిపిఒ ఉమామహేశ్వరి వివరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

దళిత పేటల్లో సమస్యలపై సర్వేలు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనవరి 25వ తేదీలోగా దళితపేటలలో సమస్యలను సర్వేచేసి వాటి పరిష్కారానికి, రౌండ్‌టేబుల్ సమావేశాలు, సచివాలయాల వద్ద, మండల కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. శనివారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షతన జిల్లా విస్తత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిత్యావసర సరుకులు పేదలు కొనలేని విధంగా పెరిగిన నేపథ్యంలో చౌకధరల దుకాణాల ద్వారా అందించాలని కోరారు. పని అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులను కల్పించాలని, కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు కూలీలపై ప్రభావం చూపుతుందన్నారు. యంత్రాలు రావడం వల్ల వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిపోయాయని, దీంతో పనుల కోసం వలసలు పోతున్నారన్నారు. వలసలు నివారించడానికి వామపక్షాల కృషితో వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరు కార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నామని విమర్శించారు. ప్రస్తుత అవసరాల ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో ఈ చట్టానికి రూ. 2లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేంద్ర బడ్జెట్లో కేవలం రూ.60వేల కోట్లే కేటాయించారని తెలిపారు. కేటాయించిన వాటిలో కూడా 60 శాతమే కూలీలకు వేతనాలు చెల్లించటానికి అవకాశం ఉందని వివరించారు. నిధులు తగ్గిస్తే చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయటం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాబోయే బడ్జెట్‌లోనైనా ఉపాధిహామీ పనులకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, కనీస వేతనం రూ.600లు చెల్లించాలని, కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల కేటాయింపులో దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా మహిళా కన్వీనర్ బి.కోటేశ్వరి నాయకులు జి.అజయ్, ఈ.కాటమరాజు, మేరి, శివయ్య, నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈమని అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సమావేశంలో అనంతరం శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్‌విలాస్ ఆర్వోబి, ఇన్నర్‌రింగ్ రోడ్డు లో రెడ్డిపాలెం ఆర్‌వోబి, శ్యామలానగర్ ఆర్‌వోబిల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆయన వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న నందివెలుగు ఆర్‌వోబిని పూర్తి చేసేందుకు రూ.30 కోట్ల అంచనాలతో మళ్లీ డిపిఆర్ తయారు చేస్తున్నారని తెలిపారు. అలాగే మంగళగిరి, పెదపలకలూరులలో కూడా ఆర్‌వోబిల నిర్మాణంపై ప్రతిపాదనలు కేంద్రానికి పంపామని తెలిపారు. గుంటూరు నుంచి 12 రోడ్లు వివిధ మార్గాల్లో నిర్మిస్తున్నట్టు వివరించారు. శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్ లో ప్రారంభం అవుతుందన్నారు. ఇందుకు సంబంధించి వచ్చే రెండునెలల్లో టెండర్లు ఖరారు అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన అండర్ పాస్ బ్రిడ్జీలు 2026 జులై మాసాంతానికి పూర్తి చేస్తామని అధికారులు మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ నుండి అమరావతికి చేరుకోవడానికి బైపాస్ రహదారి నిర్మాణం దాదాపు ఐదు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాలన్నింటిని ప్రజాప్రతినిధుల, అధికారులతో ప్రతి మూడు నెలలో కొకసారి ఈ దిశా సమావేశం ద్వారా సమీక్షించడం జరుగుతుందన్నారు. గుంటూరు పట్టణానికి కావలసిన తాగునీటికి అమృత్ - 2 పథకం క్రింద రూ. 184 కోట్లతో ఒకటి , మరొక ప్రాజెక్ట్ కు రూ.25 కోట్లతో చేపట్టే కార్యక్రమంపై, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పరిస్థితిపై సమీక్షించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, గల్లా మాధవి, నశీర్ అహ్మద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిఆర్‌ఓ షేక్. ఖజావలి , జెడ్పి సిఇఓ జ్యోతిబసు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో పసుపు రైతుల ధర్నా

ప్రజాశక్తి - కొల్లిపర

సమస్య పరిష్కారం కోసం సోమవారం తెనాలి ఇన్సురెన్స్ కార్యాలయం వద్ద నిర్వహించు ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు దగ్ధమై సంవత్సరం గడచిన ఇంతవరకు ఇన్సూరెన్స్ క్లైమ్ జరగలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం రూ 7000 బాధిత రైతుల ఖాతాలో జమ కాపోవడం వలన బాధిత పసుపు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమస్య పరిష్కారం కోసం సోమవారం తెనాలి మారీసుపేటలోని ఇన్సూరెరన్స్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో బాధిత రైతులు పాల్గొనాలని కోరారు.


కాజీపేటలో ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దార్

గ్రామసమస్యల పరిష్కారానికి ప్రజలు సహకరించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - తెనాలి

గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం కూడా అవసరమని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ చెప్పారు. రూరల్ గ్రామం ఖాజీపేటలో స్మశాన వాటిక సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. గ్రామంలో కొందరు క్రైస్తవ మతాచారాలను ఆచరిస్తూ, స్థానికంగా ఉన్న స్మశాన వాటికలో మృతదేహాన్ని పూడ్చి పెట్టడాన్ని, అదేవిధంగా శవపేటికను ఊరేగిస్తూ తీసుకువెళ్లడాన్ని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో తహసీల్దార్ స్పందించారు. ఒక వర్గంతో సమావేశమై వారి వారి మతాచారాల ప్రకారం చనిపోయిన వారి అంత్యక్రియలు జరుగుతాయని, దానికి అభ్యంతర పరచడం సరికాదని వారితో చర్చించారు. అయినప్పటికీ వారి నుంచి సహకారం కొరవడంతో సోమవారం రెండో వర్గంతో కూడా సమావేశం నిర్వహించి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన నిష్క్రమించారు. అలాగే కొలకలూరు -దుగ్గిరాల రైలు మార్గంలో చెన్నైకి మూడవ లైను ఏర్పాటు కారణంగా దాదాపు 200 పైచిలుకు ఎకరాల రైతులకు దారి సమస్య ఏర్పడటంతో సమీపంలో ఉన్న డొంక మార్గాన్ని వినియోగించుకునే రీతిలో దుగ్గిరాల తహసిల్దార్ సునీతతో కలిసి సర్వే నిర్వహించి, డొంకకు మార్కింగ్ చేసి సమస్యను ఓ కొలిక్కి తెచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్, వీఆర్వోలు, విఆర్ఎ లు ఉన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో మంగళగిరిలో నేడు నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

పార్లమెంటులో అంబేద్కర్ను అవమానిస్తూ మాట్లాడిన అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ మంగళగిరిలో వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఆదివారం పదిన్నర గంటలకు మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఏ ప్రభాకర్, సిపిఐ ఎంఎల్ నాయకులు కే కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు.

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన సీనియర్ సిటిజన్స్

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్స్ నగర కమిషనర్ నాయుడుపేటలోని నగర పాలకసంస్థ లెగసి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఎక్స్పోజర్‌ను శనివారం సందర్శించారు. తొలుత నాయుడు పేటలోని లెగసివేస్ట్ బయో రెమిడియేషన్‌ను పరిశీలించారు. లెగసి వ్యర్థాల సాంకేతిక ప్రక్రియను సీనియర్ సిటిజన్స్‌కు వివరించారు. అనంతరం జిందాల్ వేస్ట్ టు ఎనర్జి ప్లాంట్‌ను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో కలిసి ప్లాంట్‌లోని ట్రిప్పింగ్ ఫ్లోర్, గ్రాప్ కంట్రోల్ రూమ్, బాయిలర్ 25 మీటర్, నెస్ట్ ట్రిప్పింగ్ ఫ్లోర్, బాయిలర్ 8 మీటర్, ఇన్సరేటర్, డిసిఎస్ కంట్రోల్ రూమ్, టిజి హాల్ లను పరిశీలించారు. జిందాల్ సాంకేతిక నిపుణులు ప్లాంట్ ప్రారంభమైన నాటి నుండి ప్రతి రోజు ప్లాంట్ కు వచ్చే చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి వరకు పూర్తి సమాచారాన్ని విభాగాల వారీగా వారికి వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో, అభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ పాత్ర కీలకమని, అందులో భాగంగనే వారితో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు అనంతరం పరిసరాలు శుభ్రం చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, నగర పాలక సంస్థ యస్.ఈ నాగ మల్లేశ్వర రావు, సి.యం.హెచ్ ఓ డాక్టర్ అమృత తదితరులు పాల్గొన్నారు.


ప్లాంట్ గురించి వివరిస్తున్న అధికారులు

పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువు

నందివెలుగు హైస్కూల్ భవన ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి - తెనాలి

పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువేనని, ఆ చదువులో విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులదేనని కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రూరల్ గ్రామం నందివెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నిర్మించిన తరగతి గదులను, క్రీడా ప్రాంగణాన్ని శనివారం డాక్టర్ పెమ్మసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతాన్ని, జ్ఞాపకాలను మర్చిపోకుండా మేము సైతం అంటూ పాఠశాల భవన నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరు అభినందనీయలేనన్నారు. పాఠశాలను ప్రైవేట్ స్కూల్‌కి దీటుగా నిర్మించారని ప్రశంసించారు. గతంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శంకుస్థాపన చేసిన భవనాన్ని తిరిగి తనతో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విద్యాశాఖ నిర్వహణ కత్తి మీద సాము వంటిదని అలాంటి శాఖ బాధ్యతలను యువ నాయకులు నారా లోకేష్ తీసుకోవటం, కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించే ఎన్నారైలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విదేశాలకు వెళ్లి పేరు ప్రఖ్యాతులు సంపాదించి పుట్టిన గ్రామంలో పాఠశాల నిర్మాణానికి కృషి చేసిన దాతలు అభినందనీయులు అన్నారు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి పవన్ కుమార్, నన్నపనేని లింగారావు, వైయస్సార్ నన్ వి ఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ఎన్వియర్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత ఎం భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, గ్రామ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటి తదితరులు

మోరతోట సుబ్బారావుకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



తాడేపల్లి పట్టణం, కొత్తూరు సిపిఎం శాఖ సభ్యులు మోర తోట సుబ్బారావు (68) శనివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృత్తి రీత్యా బోర్లు వేసే పని చేస్తుంటాడు. గురువారం కంకిపాడు ప్రాంతంలో బోర్లు పని చూసుకొని ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, ఎదురుగా మరొక ద్విచక్ర వాహనం వేగంతో వచ్చి సుబ్బారావు వాహనాన్ని ఢీ కొట్టడంతో, సుబ్బారావు కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సుబ్బారావు శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సుబ్బారావ్ మృతికి తాడేపల్లి కొత్తూరు శాఖ సిపిఎం సభ్యులు సంతాపాన్ని తెలిపారు. ఆదివారం ఉదయం సుబ్బారావు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.



పీఎం ఇంటర్న్‌షిప్‌తో యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకునేందుకు ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమం దోహదపడుతుందని సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 ఏళ్లలో దేశంలో 500 లకు పైగా బహుళజాతి కంపెనీలలో కోటి మంది యువతకు ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. దేశ వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించి 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు ఇంటర్న్ షిప్ లో దేశ వ్యాప్తంగా అవకాశాలు ఉంటాయన్నారు. భారత ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద చేరే ప్రతి ఒక్కరికీ బీమా కవరేజీ అందిస్తుందన్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. ఐదు వైద్య బృందాల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. పశువులకు చూడి పరీక్షలు, గొర్రెలు, మేకలు, దూడలు, ఎద్దులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్‌గా భార్గవ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వాణిజ్య పన్నుల శాఖ పిడుగురాళ్ల సర్కిల్ సహాయ కమిషనర్‌గా వి.భార్గవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్ గ్రూప్-1అధికారి అయిన భార్గవ.. శిక్షణ అనంతరం తొలిసారి ఇక్కడే విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యసాధనలో సర్కిల్‌ను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

28 నుంచి గోలివాగు వంతెనపై రాకపోకలు

ప్రజాశక్తి - రెంటచింతల

గోలివాగుపై చేపట్టిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశకు చేరాయని, ఈ నెల 28 నుంచి రాకపోకలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శనివారం గోలి వాగు బ్రిడ్జి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కంభంపాడు బ్రిడ్జి వాడుకలోకి వచ్చిందని చెప్పారు. గోలివాగు వంతెన రూ.1.8 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఆసుపత్రికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి-పెదకూరపాడు

దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని పెదకూరపాడు ప్రభుత్వ ఆసుపత్రికి పది కుర్చీలను టిడిపి నాయకులు అందజేశారు. యువ నాయకులు గళ్ల శివ సొంత నిధులతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ చేతుల మీదుగా కుర్చీలను అందించారు. జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్

- వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి తారక రామారావు వర్ధంతి
- నివాళులర్పించిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

ప్రజాశక్తి- వినుకొండ : సంక్షేమ పథకాలు, సంస్కరణల అమల్లో దివంగత నందమూరి తారక రామారావుది చెరగని ముద్ర అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం వినుకొండలో నిర్వహించారు. స్థానిక గంగినేని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. జీవీ ఆంజనేయులుతోపాటు 518 మంది రక్తదానం చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.





నకరికల్లు : తెలుగువారి ఆత్మగౌరవం నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నకరికల్లు గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కన్నా.. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగోతు సౌరయ్య, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీగా అన్నసమారాధన చేపట్టారు.

అచ్చంపేట : అచ్చంపేట మండలంలోని రుద్రవరం గ్రామంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ లావు కృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకొస్తామని చెప్పారు.

రక్తదానం చేసిన ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల : తెలుగు జాతి ఉన్నంత వరకు ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ నిలిచి ఉంటారని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, నాయకులు కొమెర దుర్గారావు, కేశవరెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట : ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే నేటికీ దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కూడలిలో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ నగర్, కళామందిర్ సెంటర్, 34వ వార్డు సుగాలి కాలనీ, 7వ వార్డు ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు, వస్త్రాల పంపిణీ చేపట్టారు. 32వ వార్డు భావనారుషినగర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

దాచేపల్లి : పట్టణంలోని కారంపూడి రోడ్డు వద్ద నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, పిడుగురాళ్ల జడ్పీటీసీ సభ్యులు జంగా కోటయ్య పాల్గొని, నివాళులర్పించారు.

యడ్లపాడు : యడ్లపాడులో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నల్లమేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు పిఎస్కే మస్తాన్ షరీఫ్ , బెల్లంకొండ సర్పంచ్ సముద్రం, పల్నాడు బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఓర్చు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్ : విజయపురిసౌత్‌లో కూటమి నేతల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పులిహోర, స్వీట్లను పంపిణీ చేశారు.

క్రోసూరు : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని క్రోసూరు మండల పరిధిలో మాజీ యార్డ్ చైర్మన్లు కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, బండారు మైసూర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ అన్నదానం చేపట్టారు.

నాదెండ్ల : మండలంలోని నాదెండ్ల, గణపవరం, తూవాడు, సాతులూరు, అప్పాపురం, ఎడ్లపాడు, కనపర్రు, అమీన్ సాహెబ్‌పాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల పులిహోర, స్వీట్లు పంచిపెట్టారు.


పిడుగురాళ్ల: పట్టణంలోని పిలుట్ల రోడ్డు వద్ద జరిగిన కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. అనంతరం పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వద్ద బస్ షెల్టర్‌ను ప్రారంభించారు.

పల్నాడు జిల్లా : పేదల ప్రజల గుండెల్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో, చిలకలూరిపేట బస్టాండ్ వద్ద గల జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు విగ్రహానికి, మాజీ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.o ~మారావు వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్త దానం చేశారు. రక్తదాతలకు ఎమ్మెల్యే అరవిందబాబు సర్టిఫికెట్లను అందించారు.

పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రం పెద్దకూరపాడులో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.













ఓడిపోతే రాజకీయ సన్యాసమన్నావ్.. ఏమయ్యావ్?

ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి- మాచర్ల :

కేవలం ఆరు నెలల కాలంలోనే విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని నిలుపుతూ, ఉక్కు కర్మాగారానికి ఆర్థిక ప్యాకేజీ కేంద్రం ద్వారా రూ.11,500 కోట్లు సాధించుకున్నామని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఓడిపోతే రాజకీయ సన్యాసమని మీసాలు మెలేసి సవాళ్లు విసిరిన కొంతమంది ఏమయ్యారని ప్రశ్నించారు. శనివారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. చిత్తశుద్ధి అంటే ఇసుక, మైనింగ్ దోచుకోవడం.. లిక్కర్‌పై 300 రెట్లు భారం మోపడం కాదని చెప్పారు. చిత్తశుద్ధి అంటే అభివృద్ధి అని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ఎన్డీఏ కూటమి కంకణం కట్టుకుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలంతా భద్రంగా ఉన్నారని.. దానికి నిదర్శనం మాచర్ల నియోజకవర్గమని చెప్పారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, అలజడులు సృష్టించాలని ప్రయత్నించినా వైసీపీ నాయకులను, కార్యకర్తలను రోడ్డుపై నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక్కడి వైసీపీ నాయకులు ఏనాడైనా రైతుల గురించి పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో ఆక్రమించిన భూములు రైతులవి కాదా? అని నిలదీశారు. 'వరికపూడి సాధిస్తాను.. లేకపోతే రాజకీయ సన్యాసం చేస్తాను. ఓడిపోతే రాజకీయాలను శాశ్వతంగా తప్పుకుంటాను అంటూ మీసాలు మెలేసి, జబ్బలు చరిచి, చాలెంజ్ లు విసిరి రైతన్నలను మోసం చేసిన పిన్నెల్లి.. ఏమైంది, నీ ఛాలెంజ్‌లు, సవాళ్లు? పల్నాటి ప్రజలు గొర్రెలు అనుకోవద్దు. నీలాంటి రాక్షసులను ఎన్నికల్లో శిక్షించారన్న విషయాన్ని మరచి పోవద్ద'ని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ధైర్యం ఉంటే నియోజకవర్గం సమస్యలపై చర్చించేందుకు రావాలని.. అబద్ధాలు మాట్లాడ్డని సవాల్ చేశారు. అభివృద్ధికి ఖర్చు పెట్టే ప్రతి పైసా గ్రామ సభలో చర్చకు పెడుతున్నారని, నయా పైసా సహా లెక్క చెబుతూ ప్రజలకు జవాబుదారీగా ఉంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కనివ్వకుండా ప్రజలు బుద్ధి చెప్పినా.. వైసీపీలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

స్వచ్ఛత.. అందరి బాధ్యత





ప్రజాశక్తి-గుంటూరు
స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని కమిషనర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం ఒక థీం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవ హారం ఏర్పాటు చేశారు. ప్రజలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ ప్రారంభంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిఎంసి అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మంగళగిరి : స్వచ్ఛత.. ప్రతి ఒక్కరి బాధ్యతని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలువురు అధికారులు, అధికార పార్టీ నాయకులు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం చేపట్టే స్వచ్ఛత కార్యక్రమాలను పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించారు. మంగళగిరిలో ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎంటిఎంసి కమిషనర్ అలీం బాషా, కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులతో ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోలో మంగళగిరి గాలి గోపురం నుంచి మిద్దె సెంటర్ వరకు పట్టణం ర్యాలీ సాగింది. పరిసరాల శుభ్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్లాస్టిక్‌రహిత సమాజానికి కృషి చేద్దాం..

తుళ్లూరు : ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేద్దామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సిహెచ్ కృష్ణ అన్నారు. రాజధాని అమరావతి ప్రాంత గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా మానవహారం, ర్యాలీలు నిర్వహించారు. తుళ్లూరులోని గ్రంథాలయం సెంటర్లో డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడివో కె.శిల్ప, తహసీల్దార్ సుజాత, ఈవోఆర్డి ప్రభాకరరావు, ఎపిఎం చిన వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు పురస్కారాలు

దుగ్గిరాల : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఏటా పురస్కారాలు అందజేస్తామని స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ సభ్యులు తెలిపారు. మండల కేంద్రం దుగ్గిరాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగం గా స్థానిక ఎంపీడీవో కార్యాల యం నుంచి రథం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రథం సెంటర్ వద్ద మానవహారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దారు ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం ఎస్.సురేష్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





కొల్లిపర : పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడూ తమవంతు బాధ్యత వహించాలని కొల్లిపర ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కొల్లిపర మండలంలోని కొల్లిపర, అత్తోట, వల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేశారు. వీధుల్లో ర్యాలీ చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు.

తెనాలి : చిన్నరావూరు సత్యనారాయణ లేక్ పార్క్‌లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ బి.శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పార్క్ లోపలి ప్రాంతంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ఛైర్ పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

జోసిల్ కంపెనీలో స్వచ్ఛ ఆంధ్ర..

మేడికొండూరు : మండలంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న డోకిపర్రు జోసిల్ కంపెనీలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, పచ్చదనాన్ని పెంపొందించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని కంపెనీ అడ్వైజర్ రామినేని బెనర్జీ బాబు, యడ్లపాటి భాను ప్రసాద్ అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం కంపెనీలో స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కంపెనీ కార్యదర్శి కోట రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాల సిబ్బందితో కలసి ర్యాలీ చేపట్టారు.

బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనపై పరిశీలన

➤'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - తుళ్లూరు
స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌ను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖాధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో 'దయనీయంగా తుళ్లూరు ఆర్‌టిసి బస్టాండ్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. బస్టాండ్‌లో కనీస సౌకర్యాల కల్పనపై పరిశీలన జరిపారు. మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సమస్యల పరిష్కారానికి ప్రజాసహకారం అవసరం

ప్రజాశక్తి-తెనాలి
గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం కూడా అవసరమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం ఖాజీపేటలో శ్మశాన వాటిక సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. ఒక వర్గంతో చర్చించారు. మరో వర్గంతో త్వరలో సమావేశమవుతామని తెలిపారు. కొలకలూరు-దుగ్గిరాల రైలు మార్గంలో చెన్నైకి మూడవ లైను ఏర్పాటు కారణంగా దాదాపు 200 పైచిలుకు ఎకరాల రైతులకు దారి సమస్య ఏర్పడింది. దీంతో సమీపంలో ఉన్న డొంక మార్గాన్ని వినియోగించుకునేందుకు దుగ్గిరాల తహసీల్దార్ సునీతతో కలిసి సర్వే నిర్వహించారు. డొంకకు మార్కింగ్ చేసి సమస్యను ఓ కొలిక్కి తెచ్చారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ, అమిత్‌షా'

ప్రజాశక్తి-మంగళగిరి
దేశ రాజకీయాలను, ంప్రజాస్వామ్యాన్ని మోదీ, అమిత్ షాలు ఖూనీ చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పూజారి కన్నుమూత




ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామానికి చెందిన వేణుగోపాల స్వామి ఆలయ అర్చకులు పరుచూరి పెద మారుతి వరప్రసాదాచార్యులు (82) అనారోగ్యంతో శనివారం ఉదయం తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సుమారు 50 సంవత్సరాలుగా గుండె మెడ గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయం పూజారిగా సేవలందిస్తున్నారు. పెద్ద మారుతి వరప్రసాదాచార్యులు మృతి వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, తెలుగుదేశం తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, టిడిపి నాయకులు చిగురుపాటి సుబ్బారావు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు పాటి బండ్ల కృష్ణమూర్తి ఆయన భౌతికయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

21న సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-చేబ్రోలు
ఈ నెల 21న చేబ్రోలు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.లలిత తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు. వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి
ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం టీడీపీ నాయకులు పలువురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, టౌన్ కమిటీ సభ్యులు కారంపూడి చిరంజీవి, టీడీపీ నాయకులు నన్నపనేని నాగేశ్వరరావు, పుల్లారెడ్డి, మండవ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



దేహదారుఢ్య పరీక్షల్లో 312 మంది అర్హత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శనివారం కొనసాగాయి. స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 529 మంది హాజరు కాగా.. వారిలో 95 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 434 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 43 మంది అనర్హులయ్యారు. మిగిలిన 391 మందికి 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. 70 మంది అనర్హులు కాగా, 321 మంది తదుపరి పరీక్షల కోసం అర్హత సాధించారు. వీరిలో 321 మందికి 100 మీటర్ల పరుగు పందెం చేపట్టారు. 151 మంది అనర్హులుగా నిర్ధారించారు. మొత్తం అన్ని పరీక్షల్లో 434 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహించగా వారిలో 312 మంది అర్హత సాధించారు. 122 మంది అనర్హులయ్యారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీలు సుప్రజ, రమణమూర్తి తదితరులు పరిశీలించారు.



ఎన్టీఆర్ ఎప్పటికీ సజీవం

ప్రజాశక్తి-గుంటూరు
తెలుగు జాతి హృదయాలలో ఎన్‌టిఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఎన్‌టీఆర్ లైబ్రరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రత్తయ్య మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు, మహిళలకు సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఆయన విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో ఒక గొప్ప నటుడిగా ప్రతిపాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రత్తయ్య

రహదారి పై కమ్మేసిన పొగ

ప్రజాశక్తి ప్రత్తిపాడు : రహదారి పక్కనే వ్యర్థాలను తగల పెట్టడంతో రహదారి పై వెళ్ళే దారిలో వాహనాలు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. శనివారం మండల పరిధిలోని కొయవారి పాలెం లోతట్టు బ్రిడ్జి వద్ద వ్యర్థాలు తగల పెట్టడంతో రోడ్డు పై పొగ వ్యాపించి ఎదురు వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. పొగ దాటే వరకు ఊపిరి కూడా అడని పరిస్థితి నెలకొంది. వ్యర్థాలు తగుల బెట్టిన ప్రాంతంలో లోతట్టు బ్రిడ్జి ఉండటం చేత అక్కడ ఒక వాహనం వస్తె మరో వాహనం ఆగిపోవాల్సిన పరిస్థితి ఉంది. గతంలో ఒక కారును తప్పించబోయి బస్సు కాల్వలోకి దూసుకు వెళ్లి అక్కడే ఉంటున్న ఇళ్లలోకి దూసుకు వెళ్ళింది. ఆ సమయానికి ఎవరు లేక పోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రజలు వ్యర్థాలను రోడ్ల వెంబడి వేయకుండా వాటిని చెత్త సంపద కేంద్రాల వద్ద వేసేలా చూడాలని అభిప్రాయ పడుతున్నారు.

చెత్త వినియోగంపై దృష్టి పెట్టండి

స్థానిక సంస్థలకు పవన్ కల్యాణ్ ఆదేశం

ప్రజాశక్తి-పెదకాకాని



చెత్త వినియోగంపై ప్రతి ఒక్కరూ దృష్టిపెట్టాలని, ప్రతి ఇంట్లో వర్మికంపోస్టు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నంబూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "2047 వికసిత్ భారత్‌లో స్వచ్ఛత అనేది ప్రధానమన్నారు. కరోనా సమయంలో పారిశుధ్య నిర్వహణకు, స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చామని ఈ విషయంలో క్రమశిక్షణ అందరిలో మళ్లీ రావాలని ఆకాంక్షించారు. స్వచ్ఛత, పరిశుభ్రత అనేది మనందరి జీవితంలో ఓ భాగం అనే దాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భవిష్యత్తులో చెత్త కనిపించని భారతదేశం సాకారం కావాలని కోరారు. చెత్త నుంచి సంపద సృష్టి జరగాలన్నారు. చెత్తను వేరు చేయడం ద్వారా, దాన్ని మళ్లీ పునర్వినియోగం కోసం ఉపయోగించడం ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చునని తెలిపారు. చెత్త కదా.. దానిని ఏం చేస్తాం అనే భావన కాకుండా, పునర్వినియోగానికి పనికొచ్చే చెత్తను ఇంట్లోనే వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా విద్యుత్ ప్లాంటు నిర్వహణ, వర్మీ కంపోస్టును తయారు చేసేందుకు సైతం స్థానిక పరిస్థితులను ఆధారంగా చేసుకొని స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఇంట్లోనే చెత్తను వేరు చేయడం, నిర్మూలించే కార్యక్రమం జరిగినపుడే చెత్త ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ఎంతో కష్టపడి పని చేసి, ప్రజల మన్ననలు అందుకున్న 35 మంది పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి - గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి



తెనాలి ఆర్టీసీ డిపో నుంచి గుంటూరుకు నాన్ స్టాప్ సర్వీస్‌లను డిపో మేనేజర్ రాజశేఖర్ శనివారం పునరుద్ధరించారు. గతంలో డిపో నుంచి గుంటూరుకు నాన్‌స్టాప్ సర్వీసులు ఉండేవి. అయితే ఇదే మార్గంలో నారా కోడూరు మీదుగా ఆర్డినరీ సర్వీసులు అధికంగా ఉండటంతో నాన్‌స్టాప్ సర్వీసులకు ఆదరణ కరువైందని రద్దు చేశారు. పలువురు ఉద్యోగులు, వ్యాపారులు నాన్ స్టాప్ సర్వీసులను పునరుద్ధరించాలని పలుమార్లు సమర్పించిన వినతి పత్రాల మేరకు మంత్రి స్పందించారని తెలిపారు. నూతన సర్వీసులతో నాన్ స్టాప్ సర్వీసులను పునరుద్ధరించామని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు ప్రతి అరగంటకు ఒక సర్వీస్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

శంకరవిలాస్ ఆర్వోబీ విస్తరణ పనులు ప్రారంభం

భవనాల తొలగింపు చేపట్టిన జీఎంసి

ప్రజాశక్తి-గుంటూరు



శంకర్ విలాస్ నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ముందుగా భవనాల తొలగింపు పనులు గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టింది. స్థానిక తాలూకా వద్ద రోడ్డు విస్తరణకు అంగీకారపత్రం అందించిన నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఆరు షాపులు, మొదటి అంతస్తును జీఎంసీ వారు శనివారం తొలగింపు పనులు ప్రారంభించారు.బ్రిడ్జి నిర్మాణానికి అనుగుణంగా రోడ్డు విస్తరణలో భాగంగా మొత్తం 134 భవనాలు, ఆస్తులకుగాను 99 ప్రైవేటు భవన యజమానులకు, 14 ప్రభుత్వ, 21 మిషనరీ ఆస్తులకూ నోటీసులు జారీ చేశారు. కాగా ప్రైవేట్ భవన యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారని నగర కమిషనర్ తెలిపారు. విస్తరణలో వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇస్తామన్నారు. భవన యజమానులకు కోల్పోయిన భవనాలకు వారి ఆస్తి విలువను బట్టి నష్టపరిహారం, స్థలము విలువనకు 4 రెట్లు విలువైన టి.డిఆర్ బాండ్లను అందజేస్తామన్నారు.కావున ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని, నగర అభివృద్ధికి చేపడుతున్న చేపడుతున్న రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరారు.

కోవిడ్ కాలంలో మరణించిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు : కరోనా సమయములో మరణించిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా ఒక ప్రకటనలో కోరారు. 2020లో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఇప్పటికీ ఉద్యోగాలు కల్పించకపోవటం అన్యాయం అన్నారు. కారుణ్య నియామకాల ద్వారా పంచాయతీ రాజ్‌శాఖలో ఎక్కువ మంది ఉండడం వలన, అక్కడ ఖాళీలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 110 నుండి 150 మంది వరకు ఉపాధ్యాయుల పిల్లలకు ఉద్యోగావకాశాలు లేక వారి కుటుంబ సభ్యుల జీవితాలు చాలా దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానిక సంస్థలలోనే ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను వన్‌టైం సెటిల్మెంట్ క్రింద సడలించి, అందరినీ కారుణ్య నియామకాల క్రింద నియామకాలు చెపట్టాలని కోరారు.

ధాన్యం కొనుగోలుకు మీనమేషాలు

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు నిలిపివేసి 10 రోజులు దాటినా ప్రజా ప్రతినిధులు నోరుమెదపడం లేదు. కొనుగోలుపై ప్రభుత్వం తొలి విడత తమకు కేటాయించిన స్వల్ప లక్ష్యం పూర్తి చేశామని తిరిగి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే కొనుగోలుకు లక్ష్యం నిర్దారిస్తే నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసింది కేవలం 80 వేల టన్నులు కొనుగోలు చేశారు. గుంటూరు జిల్లాలో రెండు దఫాల్లో ఇచ్చిన లక్ష్యం మేరకు 27 వేల టన్నులు, పల్నాడు జిల్లాలో కేవలం ఐదు వేల టన్నులు, బాపట్ల జిల్లాలో 50 వేల టన్నులు కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తం ఉత్పత్తిలో ఇప్పటి వరకు 10 శాతం కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో సొమ్ములుచెల్లిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం స్వల్ప లక్ష్యంతో కొనుగోలు ప్రక్రియను ముగించారు. మళ్లీ గత 10 రోజులుగా ఆదేశాలు లేవు. చాలా తక్కువ స్థాయిలో లక్ష్యం నిర్దారించి ఆ మేరకు కొనుగోలు పూర్తి చేసినట్టు చూపి తదుపరి లక్ష్యం ఇవ్వకుండా నిలిపివేశారని మిల్లర్లు తెలిపారు. రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన పలువురు రాష్ట్ర మంత్రులు కొనుగోలు నిలిపివేసినా మిన్నకుండిపోయారు. ఈ ఏడాది కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1740కు కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1400 మించి కొనేనాథుడు లేరు. తేమశాతం బూచిగా చూపి బస్తాకు రూ.350 వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తే తక్కువ ధరకు విక్రయించడం వల్ల రైతుకు ఎకరాకు రూ.10 వేలు నష్టం వస్తోంది. గత కొంతకాలంగా వాతావరణంలో మంచు ప్రభావం, ఎక్కువ రోజులు జల్లులు పడుతుండటం, ఎండ రాకపోవడం ధాన్యం ఎండబెట్టుకునేందుకు అవకాశం లేకపోవడం వల్ల రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల కల్లాల్లో వ్యాపారులు చెప్పిందే వేదంగా రూ. 1400 కన్నా తక్కువకే అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలు ఉన్నా అందులో 10 శాతం కూడా లక్ష్యం నిర్దారించకపోవడం వల్ల అధికారులు మిల్లర్లపై వత్తిడి చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ధర కోసం వేచి ఉండే వారు మాత్రం పొలాల్లోనే కుప్పలు వేసి రబీ పంటలు కోతలు పూర్తయిన తరువాత మార్చి, ఏప్రిల్‌లో నూర్పిడి చేసి విక్రయిస్తుంటారు. వేచి ఉండలేని రైతులు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఒక్కరే స్పందించారు. పొన్నూరు నియోజకవర్గంలో కోతలు ఆలస్యంగా ప్రారంభం అయ్యాయని, తమ రైతుల వద్ద నిల్వలు ఉన్నాయని ఆయన ఈనెల 6వ తేదీన జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అయినా కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని అధికారులు చొరవ తీసుకోలేదు. దీంతో ఆయన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ప్రభుత్వం వద్ద నిధులు లేవని 22 వ తేదీ వరకు వేచి ఉండాలని మంత్రి సూచించినట్టు తెలిసింది. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు తగ్గడం వల్ల ప్రత్యామ్నాయంగా పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు చొరవ తీసుకోవాల్సి ఉండగా అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని డెల్టా ప్రాంత రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధర ప్రకారం రూ.1740కి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

కెఎస్ లక్ష్మణరావు గెలుపు అందరి బాధ్యత

ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశంలో వివిధ సంఘాల నేతలు

ప్రజాశక్తి - విజయవాడ



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో గళమెత్తే కె.ఎస్.లక్ష్మణరావును వచ్చే ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించాలని వివిధ ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చాయి. ఈ ఏడాది మార్చిలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజాసంఘాలు బలపరచిన ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఎంఎల్‌సి ఎన్నికల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరికీ నిత్యం అందుబాటులో ఉండే ప్రజల మనిషి, నిత్య కృషీవలుడు, మేధావి, విద్యావేత్త అయిన ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలతోపాటు వివిధ ప్రజాసంఘాలపై ప్రధానంగా ఉందన్నారు. విద్యారంగ ప్రయోజనాలు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిల గెలుపు అవశ్యమన్నారు. అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పర్యాయాలు ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. దీనికి ప్రజా సంఘాల పోరాటాలు, నాయకత్వాల కృషి ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం శాసన మండలిలోనూ, బయట పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేసిన అనేక పోరాటాలను గుర్తు చేశారు. ముఖ్యంగా టీచర్ అప్రెంటిస్‌షిప్ రద్దు కోసం లక్ష్మణరావు నిరవధిక దీక్ష చేసి ఫలితం సాధించారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలు ప్రజా సమస్యలను, ఉద్యోగులు, ఉపాధ్యా యులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను అధికారుల దృష్టికి, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నిత్యం శాసన మండలిలోనూ, బయట ప్రస్తావిస్తూ వారికి మద్దతుగా ఉండే లక్ష్మణరావుకు తాము మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్ కుమార్ మాట్లాడుతూ 2010, 2015లో మెరుగైన పిఆర్‌సి, ఫిట్‌మెంట్ ఇప్పించ డంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి చేసిన కృషిని వివరిం చారు. ఈసమావేశంలో మధ్యతరగతి ప్రజా సంఘాల



మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

కన్వీనర్ విజయ ప్రకాశ్, సిఐటియు నాయకులు సుధాకర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కమల, మెడికల్ రిప్స్ నాయకులు యు.వి.కృష్ణయ్య, వి.సాంబిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హను మంతరావు, డివైఎఫ్ఐ నాయకులు ఎ.నాగేశ్వర రావు, యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య, పి.లీల, పి.నాగేశ్వరరావు తదితరులు లక్ష్మణరావుకు మద్దతుగా మాట్లాడారు. ఎల్‌ఐసి నాయకులు ఇ.వి.తులసీరావు, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల నాయకులు కె.ఎస్.సి. బోస్, ఎల్ఐసి పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఎన్.గోపాలకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు ఎన్.నాగేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు డి.హరిప్రసాద్, బి.రెడ్‌స్టార్, పలు ప్రజా సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు కోటలో ఎన్‌సిసి క్యాడెట్లకు ట్రెక్కింగ్

ప్రజాశక్తి-గుంటూరు : కొండవీడు చెక్‌పోస్టు నుండి చారిత్రాత్మక కొండవీడు కోట వరకు క్యాడెట్లు ట్రెక్కింగ్ చేశారు. ఈట్రెక్ కేవలం క్యాడెట్ల స్థైర్యాన్ని, క్రమశిక్షణను చూపించడమే కాకుండా, ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తెస్తుందని శిక్షణ ఇన్‌ఛార్జి, ఎన్‌సిసి అధికారి కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ అన్నారు. ట్రెక్ ముగిసిన తర్వాత క్యాడెట్లు రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. రెడ్డిరాజుల వంశపాలన, కోట ఆర్కిటెక్చర్ వివరాలను తెలుసుకున్నారు.



ట్రెక్కింగ్ చేస్తున్న ఎన్‌సిసి క్యాడెట్లు